సాక్షి గుంటూరు

ఆదివారం । 19 । మే । 2024



కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

ఫిరంగిపురం: వేమవరంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం శనివారం నిర్వహించారు. స్వామివారి ధ్వజాన్ని వాహనంపై ఊరేగించారు.

వాసవీమాతకు విశేష పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతిని శనివారం విశేషంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

న్యూస్‌రీల్

23న బుద్ధపూర్ణిమ వేడుకలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరిలో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఈనెల 23న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలో 25ఏళ్లుగా బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నామని, మే 23న మంగళగిరిలో 2,568వ బుద్ధ పూర్ణిమ వేడుకలను గౌతమ బుద్ధ రోడ్డులోని వైష్ణవి కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు రేకా కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని వివరించారు.

వట్టిచెరుకూరులో 45.6 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా వట్టిచెరుకూరు మండలంలో 45.6 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 1.6 మి.మీ. వర్షం పడింది. సగటున 9.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడు 12.4, చేబ్రోలు 11.8, కాకుమాను 11.6, గుంటూరు తూర్పు 9.2, మేడికొండూరు 9.2, పెదకాకాని 9.2, తాడికొండ 9.2, పెదనందిపాడు 8.4, తుళ్ళూరు 7.4, గుంటూరు పశ్చిమ 7.2, ఫిరంగిపురం 6.6, పొన్నూరు 5.2, దుగ్గిరాల 4.8, కొల్లిపర 4.2, తెనాలి 3.6, మంగళగిరి మండలంలో 2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జిల్లాలో మే 18వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 36.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 73.9 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సజావుగా ఏపీ ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీ సెట్–2024)లో భాగంగా ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు జరగనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు గుంటూరు జిల్లాలో 20 వేల మంది విద్యార్థులు హాజరు కానుండగా, 15 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

తెలంగాణ ఎంసెట్‌లో సోపిరాల విద్యార్థికి ర్యాంక్



చినగంజాం: తెలంగాణ రాష్ట్రంలో శనివారం విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన విద్యార్థి మంచి ర్యాంక్ సాధించారు. గ్రామానికి చెందిన నరహరి శ్రీహరిరావు కుమారుడు రోహిత్ శివశంకర్ రాష్ట్రస్థాయిలో 181వ ర్యాంక్ సాధించాడు. గతంలో జేఈఈ మెయిన్స్‌లోనూ 176వ ర్యాంక్ సాధించాడు. ఈ నెల 26న జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించేందుకు కృషి చేస్తున్నాడు. భవిష్యత్‌లో సివిల్ సర్వీస్ సాధించాలనేది తన సంకల్పం అని తెలిపాడు. రోహిత్ ర్యాంక్ సాధించడంపై సోపిరాల గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, బంధువులు అతనికి అభినందనలు తెలియజేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కర్లపాలెం: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం కర్లపాలెంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం కర్లపాలెంకు చెందిన ఉప్పాల పేరయ్య భార్య సరస్వతి(105) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5200, మోడల్ ధర రూ.4300 వరకు పలికింది.



పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్

ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన లఠ్కర్ గతంలో ఏపీ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపార్టుమెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2018 మార్చి నుంచి 2019 సెప్టెంబరు వరకు గుంటూరు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడు కలెక్టర్‌గా రానున్నారు. ఇక్కడ రెండేళ్లకుపైగా పనిచేసిన ఎల్.శివశంకర్‌ను ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ ఎన్నికల కమిషన్ బదిలీ చేసి అతనిపై విచారణకు ఆదేశించిన విషయం విదితమే.



పల్నాడు జిల్లా ఎస్పీగా మలిక గర్గ్

ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా మలిక గర్గ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో కృష్ణా జిల్లా అదనపు ఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకుపైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేశారు. మలిక గర్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీసు అధికారి. ఈమె రెండున్నరేళ్ల కిందట ఏర్పడిన పల్నాడు జిల్లాకు తొలి మహిళా ఎస్పీ కానున్నారు. ఎన్నికల సమయంలో నియమించబడి ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.బిందుమాధవ్ ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన విషయం విదితమే. మలిక భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

సైకిల్ ఫ్యాక్షన్

- పల్నాడులో ఆగని టీడీపీ అరాచకాలు
- పచ్చనేతలకు పోలీసుల వత్తాసు
- వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడుల పర్వం
- తిరిగి ఆ పార్టీ కార్యకర్తలపైనే అక్రమ కేసులు
- ఇంటికి వెళ్లాలంటే భయమేస్తుంది అంటున్న ఫ్యాన్ పార్టీ కార్యకర్తలు
- అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఊళ్లోకొస్తే చంపుతామంటున్నారు



మాచర్ల నియోజకవర్గం కారెంపూడిలో దాడులు చేస్తున్న టీడీపీ అల్లరి మూకలు (ఫైల్)

సాక్షి,ప్రతినిధిగుంటూరు/పట్నంబజారు: ఊళ్లోకొస్తే చంపేస్తాం.. వైఎస్సార్ సీపీకి మద్దతుగా వ్యవహరిస్తారా .. ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. ఖచ్చితంగా మట్టుబెడతామంటూ.. తెలుగుదేశం పార్టీ నేతలు మరోమారు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల సాక్షిగా ప్రారంభమైన టీడీపీ నేతల దౌర్జన్యాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. అయినా పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతోపాటు, వైఎస్సార్ సీపీ బాధితులపైనే తిరిగి కేసులు పెడుతున్నారంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం కొత్తగణేశునిపాడులో పచ్చ మూకలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే కోపంతో వారిని మట్టుపెడతామంటూ ఇళ్లపైకి దండెత్తాయి. ఆటోలు, బైక్‌లు, 50కి పైగా ట్రాక్టర్లను ధ్వంసం చేశాయి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను దొరికినవారిని దొరికినట్టు టీడీపీ మూకలు చితకొట్టాయి. చాలా మంది వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర గాయాలపాలై ప్రాణభయంతో ఊరు విడిచి పొలాల్లో తలదాచుకున్నారు. వీరికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఊళ్లొకొస్తే చంపుతామంటూ టీడీపీ నేతలు బాధిత కుటుంబాలను భయపెడుతున్నారు.

సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఎన్నికల వేళ టీడీపీకి వత్తాసు పలికిన అధికారులను బదిలీ చేడయంతోపాటు, ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పల్నాడు ప్రాంత వాసులు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు హేయమైన చర్య అని, దానిని ప్రోత్సహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే పల్నాడులో కొంత మంది పోలీసు అధికారుల వల్లే హింసాత్మక వాతావరణం నెలకొందని భావిస్తున్నారు.

కన్నాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు

పోలింగ్ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో అక్కడి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తన మార్క్ రౌడీయిజాన్ని చూపించారు. నియోజకవర్గంలోని చాగంటివారిపాలెంలో ఎన్నికల రోజు పోలీసులను అడ్డుపెట్టుకుని తన అనుచరులతో గూండాగిరి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూరల్ సీఐ రాంబాబు ఇష్టానుసారం లాఠీచార్జి చేయడంతోపాటు, కర్కశంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాంచారయ్య అనే కానిస్టేబుల్ మహిళలు అని కూడా చూడకుండా దాడి చేశాడని, వైఎస్సార్ సీపీ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని హింసకు తెగబడ్డారని చెబుతున్నారు. బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి అడ్డుకోబోతే కన్నా వర్గీయులు అతడిపై దాడిచేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు తీసుకోబోమని నేరుగా చెబుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల రోజున దమ్మాలపాడులో రిగ్గింగ్ జరుగుతుందని, తొండపిలో దౌర్జన్యం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించేందుకు సీఐ రాంబాబుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, కనీసం తిరిగి సమాధానం చెప్పిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఖాకీ వేసుకున్న టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించారని మండిపడుతున్నారు. సీఐ రాంబాబు, ముప్పాళ్ల మండలంలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు పడకుండా అడ్డుకోవడంతోపాటు, కన్నాకు తొత్తుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలో టీడీపీ వర్గీయులు ధ్వంసం చేసిన బైకులు(ఫైల్)

మది దోచిన నాటికలు

- కొలకలూరులో ఉత్సాహంగా నాటిక పోటీలు
- రాయప్రోలుకు వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారం
- జీఎల్ నారాయణకు జీఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కారం



రాయప్రోలు భగవాన్‌కు వైకే నాగేశ్వరరావు పురస్కారం అందిస్తున్న దృశ్యం

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న దశమ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ప్రేక్షకులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. ఈ పోటీలను మూడోరోజైన శనివారం తాళ్లూరి అజయ్‌కుమార్, కథక్ కళాక్షేత్రం, హైదరాబాద్‌కు చెందిన అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రారంభ సభకు కళ పత్రిక సంపాదకులు మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించారు. కళ, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో కొలకలూరు ఘనతను సోదాహరణంగా ప్రస్తావించారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్న గోపరాజు రమణ, విజయ్‌లను అభినందించారు. తొలిగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం'నాటికను ప్రదర్శించారు. స్నిగ్ధ రచించిన నాటికకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే.. ఆ ప్రేమలు నలుగురూ హర్షించేవిగా ఉండాలి కానీ, అనాలోచితంగా వెర్రిగా పరుగులు పెడితే జీవిత విలువలు నాశం అయిపోతాయని హెచ్చరించిందీ నాటిక. అనంతరం గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్‌వారి 'మూల్యం' నాటికను ప్రదర్శించారు. సింహప్రసాద్ రచించిన నాటికకు డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. ఆడపిల్లలపై పుట్టింది మొదలు అడుగడుగునా వివక్షను కళ్లకు కట్టిందీ నాటిక. పెళ్లయ్యాక భార్యపై సర్వాధికారాలు సంక్రమిస్తాయనడటం అమానుషం.. మహిళను సాటిమనిషిగా గుర్తించి గౌరవించాలని చాటిందీ నాటిక. చివరగా కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' నాటికను ప్రదర్శించారు. శివనారాయణ రచించిన నాటికకు సాయిబాబా దర్శకత్వం వహించారు. నేరస్తులకు శిక్ష పడినప్పుడు అనాథలైన బాధితుల్ని ఆదుకోవటం మానవత్వం అనిపించుకుంటుంది అని సందేశాన్నిచ్చిందీ నాటిక.



ఇంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం



జీఎల్ నారాయణకు జీఎల్ఎన్ మూర్తి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

సభలో యువ కళావాహిని వ్యవస్థాపకుడు వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని భీమవరానికి చెందిన రథసారథి చైతన్య కళాభారతి నిర్వాహకులు రాయప్రోలు భగవాన్‌కు అందజేసి సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయుడు జీఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కారాన్ని తెనాలికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, కళాసేవకుడు బి.ఎల్.నారాయణకు ప్రదానం చేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు సుద్దపల్లి మురళీధర్, వైద్య నాటక కళాపరిషత్ నిర్వాహకులు బొప్పన నరసింహారావు మాట్లాడారు. కొలంకపురి నాటక పరిషత్ నిర్వాహకులు గోపరాజు విజయ్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధనపై దృష్టి పెట్టాలి

జిల్లా విద్యాశాఖాధికారి శైలజ



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధనపై దృష్టిపెట్టి మెళకువలను గ్రహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్–పాఠ్యాంశాల బోధనపై గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఉపాధ్యాయులకు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. ఈసందర్భంగా ఇంగ్లిష్, సోషల్, బయాలజీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు స్ట్రక్చరల్ లెసన్ ప్లాన్, పెడగోజీ అంశాలపై రిసోర్స్‌పర్సన్లు బోధించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని పేర్కొన్నారు. సీ మ్యాట్ నుంచి పరిశీలకురాలిగా వచ్చిన ఎ.సుహాసిని మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను మెరుగుపర్చే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శిక్షణ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఎల్ఎఫ్ఈ సమన్వయకర్త తోట వీరయ్య మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో జరిగే శిక్షణకు గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గణితం, భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

నేటి నుంచి రంగనాథుని కల్యాణ మహోత్సవాలు



స్వామివారి నిజరూప దర్శనం

యడ్లపాడు: కాలగర్భంలో ఓ ఊరు కనుమరుగైంది. అప్పటి ఆలయంతోపాటు స్వామి వారు మాయమయ్యారు. కొన్నేళ్ల తర్వాత తిరిగి స్వామివారు ప్రత్యక్షం కాగా.. భక్తులు సంతోషించి ఓ ఆలయాన్ని నిర్మించారు. అందులో మళ్లీ జీర్ణోద్ధారణ గావించారు. శతాబ్దాల కిందట కనుమరుగైన ఊరు నేడు భౌతికంగా లేకపోయినా.. దివ్య స్వరూపుడైన ఆ స్వామి మరో గ్రామంలోని సుందర కోవెలలో కొలువుదీరాడు. నాటి చరిత్రకు ప్రత్యక్ష స్యాక్షంగా నిలిచి భక్తులచే నేటికీ నిత్య పూజలు అందుకుంటున్నారు. ఆ మహిమాన్వీత ఆలయమే పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస గ్రామంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవాలయం. ఆదివారం నుంచి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభకానున్నాయి.

పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ సెలక్షన్ పోటీలు




పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, నిర్వాహకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని గుమ్మడి పుల్లేశ్వరరావు జిమ్‌లో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్స్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ సెలక్షన్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్లు 20 మంది, మెన్ పవర్ లిఫ్టర్లు 30 మంది పాల్గొన్నారని, ఈ పోటీలలో ఎంపికైన పవర్ లిఫ్టర్లు ఈనెల 29 నుంచి 31 వరకు మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటారని, ఈ పోటీల నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్స్ బి.చంద్రిక, పి.భాస్కరరావు, బి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయి రేవతి, ఎండీ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఆళ్ళ పవన్ కుమార్, ఎస్‌కె సుభాని, రాజు, సలోమి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 807.00 అడుగుల వద్ద ఉంది.



క్లుప్తంగా

24 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్న 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 6,373 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డీఈఓ పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలను ఎటువంటి ఇబ్బందులూ ఎదురుకాకుండా సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షల విధులకు 27 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు సహా 280 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు.

కుక్కను హతమార్చిన వ్యక్తి అరెస్టు

గుంటూరు రూరల్: చికెన్ షాపులోకి వచ్చి కోళ్ళను తింటుందనే కోపంతో వీధి కుక్కపై కత్తితో దాడిచేసి దానిని చంపిన వ్యక్తిని నల్లపాడు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని సితార చికెన్ సెంటర్‌లో గోపీకృష్ణ పనిచేస్తున్నాడు. రోజూ ఓ వీధి కుక్క చికెన్ సెంటర్‌లోకి వచ్చి కోళ్ళను తింటుంది. శుక్రవారం అర్ధరాత్రి కూడా కుక్క చికెన్ స్టాల్‌లోకి రావడంతో గోపీకృష్ణ దానిపైకి కర్ర విసిరాడు. కుక్క అతడిపై దాడి చేసేందుకు యత్నించడంతో తన వద్ద ఉన్న కత్తితో దాడి చేసి దానిని చంపేశాడు. ఈ విషయాన్ని అదే సమయంలో అటుగా వెళుతున్న బ్లూక్రాస్ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి కుక్కను చంపిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. కుక్క మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

అప్రమత్తంగా లేకుంటే అనర్థాలే.. ఓ వ్యక్తి నుంచి అతను వాడుతున్న స్మార్ట్ ఫోన్ తీసుకుని.. ఓ పది నిమిషాలు ఆ ఫోన్‌లోని సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు చూస్తే సదరు వ్యక్తి ఆలోచనా విధానం, మానసిక స్థితిని ఇట్టే చెప్పేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో మెలకువలు తెలియని వ్యక్తులు.. వాటికి దూరంగా ఉండటమే మేలని సూచిస్తున్నారు.



అంతా చెప్పేస్తోంది!

వ్యక్తిత్వాన్ని డీకోడ్ చేస్తున్న సోషల్ మీడియా అల్గారిథమ్

- వ్యక్తిగత గోప్యతకు పెను సవాల్
- చూసే వీడియోలు, చేసే పోస్టులతో వ్యక్తుల మానసిక స్థితి అంచనా
- కొంప ముంచుతున్న డిజిటల్ సైకాలజీ
- ఖాతాదారుల యూఆర్‌ఎల్స్‌ను అమ్మేస్తున్న బ్లాగర్స్
- సమాచారంతోనే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

పట్నంబజారు: స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి వ్యక్తిపై సోషల్ మీడియా అల్గారిథమ్ పెత్తనం చెలాయిస్తోంది. అత్యధికంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో సమయం గడుపుతున్న ప్రజల భద్రతకు ఇది పెనుసవాల్‌గా మారింది. నేటి తరంలో అత్యధికంగా జరుగుతున్న సైబర్ నేరాలకు సోషల్ మీడియా అల్గారిథమ్ సహాయకారిగా పనిచేస్తోందని పలువురు సైబర్ నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి ఆలోచనా సరళి(డిజిటల్ సైకాలజీ)ని ఈ అల్గారిథమ్ పూర్తిగా బట్టబయలు చేస్తోందని హెచ్చరిస్తున్నారు.

మనమేంటో చెప్పేస్తోంది..

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్(ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, లింక్‌డిన్) వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరించేస్తున్నాయి. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగామ్, లింక్‌డిన్‌ల పని తీరు వెనుక జరిగే సెర్చ్ ఇంజిన్‌కు అనుసంధానంగా ఉండే అల్గారిథమ్ మ్యాపింగ్ వెనుక ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఆయా సోషల్ మీడియా వేదికల ద్వారా ఖాతాదారులు చూసే వీడియోలు, చేసే పోస్టులు, చదివే అంశాలు, చేసే లైక్‌లు, షేర్‌లు, చూసే సమయం, చేసే కామెంట్ ఆధారంగా వ్యక్తుల మానసిక స్థితి, ఆలోచన విధానం, అవసరాలు, అవసరం లేని అంశాలను, ఇష్టాలు, అయిష్టాలు, నడక, నడవడిక, చేసే వృత్తి, నిబద్ధత తదితర అంశాలను ఓ ప్రత్యేకమైన మ్యాపింగ్ ద్వారా అల్గారిథమ్ నూరు శాతం పసిగడుతుంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ సంబంధిత, ప్రభుత్వ/ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు, కామెడీ వీడియోలు/మీమ్స్, వంటలు, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులకు అలాంటి సంబంధిత వీడియోలు అల్గారిథమ్ ఇచ్చే సమాచారంతోనే స్మార్ట్ ఫోన్‌లకు చేరుకుంటున్నాయి. దీంతోనే స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి మానసిక స్థితితో పాటు అతని జాతకాన్ని పూర్తిగా అల్గారిథమ్ గుర్తించేస్తోంది.



సైబర్ నేరాలు వీటి వల్లే..

ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని బ్లాగ్స్.. వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్లతోనే వ్యాపారం సాగిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. వ్యక్తుల మానసిక స్థితి ఆధారంగా ఫిల్టర్ చేసిన సోషల్ మీడియా యూఆర్‌ఎల్స్‌ను బ్లాగర్స్ దగ్గర నుంచి సైబర్ నేరగాళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఉద్యోగం కోసం వెతికే వ్యక్తుల సమాచారంతో కూడిన యూఆర్‌ఎల్స్‌ను కొనుగోలు చేసిన సైబర్ నేరగాళ్లు వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఖాతా లింక్‌లు, ఫేక్ నోటిఫికేషన్‌లు పంపి ఉద్యోగాల ఆశ చూపి దోపిడీకి పాల్పడుతున్నారు. తక్కువ ధరకే వ్యవసాయ పరికరాలు అమ్మేస్తామని రైతులను, ట్రేడింగ్ లాభాలు చూపిస్తామని ఇన్వెస్టర్‌లను, డబ్బు అవసరం ఉన్న వారిని గుర్తించి లోన్స్ ఇప్పిస్తామని, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులను గుర్తించి.. వారికి వీడియో కాల్స్ చేసి హనీ ట్రాప్‌లకు తెగబడుతున్నారు. ఈ తరహా మోసాల్లో బాధితులైన వారు గుంటూరు నగరంలో వేల సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అంతేకాక అల్గారిథమ్ ఇచ్చిన సమాచారంతో వ్యక్తుల యూఆర్‌ఎల్స్ కొనుగోలు చేసిన యాడ్ ఏజెన్సీలు వారికి అనుసంధానంగా ఉన్న కంపెనీలు యాడ్‌లను ఫోన్‌లో గుప్పిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ యాడ్‌ల ఆధారంగానే ఆన్‌లైన్ షాపింగ్ చేస్తూ పలువురు మహిళలు సైబర్ నేరాల బారిన పడుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..

నగరంపాలెం: డిజిటల్ సమాచారం ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడాలని, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు అసలైనవా.. నకిలీవా అని తనిఖీ చేసుకోవాలని గుంటూరు సైబర్ క్రైం సీఐ షేక్ మౌలాషరీఫ్ సూచిస్తున్నారు. ఆయన తెలిపిన కొన్ని జాగ్రత్తలు..

- మీరు చేసే సెర్చ్ ఆధారంగానే మోసాలు జరుగుతుంటాయని తెలుసుకోవాలి. ఆన్‌లైన్ షాపింగ్ యాడ్స్ వచ్చినప్పుడు, సంబంధిత అధికారిక వెబ్ సైట్ తనిఖీ చేసుకోవాలి.
- ఉద్యోగ ప్రకటనలు వచ్చినప్పుడు విద్యార్థులు ఎక్కువ మోసపోతుంటారు. ప్రభుత్వాలు, మల్టీ నేషనల్ కంపెనీలు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వవని, ఏ విధమైన ఫీజులు అనధికారికంగా వసూలు చేయవని తెలుసుకోండి.



- అశ్లీల వెబ్ సైట్‌లు చూసినప్పుడు, వీడియో కాల్ రావడం బెదిరింపు కాల్స్ వస్తుంటాయి. ఎవరైనా ఆడియో/వీడియో కాల్ చేసి బెదిరిస్తే కంగారు పడకండి, ఇంటర్నెట్ ఆఫ్ చేసి వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.
- ప్రకటనలు రాకుండా చేసుకునే వీలు గూగుల్ సెట్టింగ్స్‌లో ఉంటుంది. ప్రైవసీ సెట్టింగ్స్ అనే ఫీచర్స్ వినియోగించుకుని మీ అకౌంట్‌కు తగు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకోండి.
- అనధికారిక లింక్‌లు ఓపెన్ చేయకూడదు. మెయిల్స్, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులకు కంగారు పడకండి.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

తాడికొండ: నిడుముక్కల గ్రామంలో ఈ నెల 13న ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య జరిగిన గొడవల వల్ల గ్రామంలో ప్రత్యేక బృందాలతో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఎస్సీ కులానికి చెందిన సర్పంచ్ మాదాసు రత్నకుమారిపై టీడీపీకి చెందిన అగ్రవర్ణ నాయకులు దాడిచేసి కొట్టిన నేపథ్యంలో ఇప్పటికే అధికారులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. దాదాపు 40 మంది పోలీసుల దాకా గ్రామంలో గస్తీ కాస్తుండగా వివాదాల పరిష్కారానికి గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామంలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఇరు వర్గాల నుంచి కొంతమందిని ఎంపిక చేసి కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంటూరు రూరల్: ఎన్నికల సమయంలో మద్యం అక్రమంగా విక్రయిస్తూ పోలీసులకు దొరకకుండా పరారైన వ్యక్తిని నల్లపాడు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం జొన్నగడ్డ గ్రామంలో తుల్లిమిల్లి సురేష్ అనే వ్యక్తి ఓటర్లను ప్రలోభ పెట్టి మద్యం పంచుతున్నాడని ఈనెల 6న ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం రావడంతో సిబ్బంది దాడి చేశారు. సురేష్ దాచి ఉంచిన 94 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి సురేష్ పరారీలో ఉన్నాడు. అతడిని శనివారం అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు రిమాండ్ విధించింది.

అనుమానితుల ఇళ్లల్లో సోదాలు

నరసరావుపేటటౌన్: ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో శనివారం వన్‌టౌన్ పరిధిలో వరవకట్ట, రామిరెడ్డిపేట, షాలెంనగర్ ప్రాంతాల్లో సీఐ కృష్ణారెడ్డి తన పోలీసులతో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. మారణాయుధాలు, రాళ్లు, పెట్రోలు బాంబుల కోసం గాలింపు నిర్వహించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో క్వాలిఫై అయి మెయిన్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన 60 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు వివరించారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరతగతి, డిగ్రీ మార్కులిస్టు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం(తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు), గ్రూప్-2 హాల్‌టికెట్, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి ఈ నెల 23లోగా రాజాగారితోటలోని, బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 సంప్రదించాలని సూచించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం(కర్నూలు): బి.మఠంలో వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనానికి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో అసువులు బాశాడు. విజయవాడ ఆర్టీసీ వారి అన్నదాన సత్రం వద్ద పడుకున్న అతడిపై కారు వెళ్లడంతో శనివారం అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు జిల్లాకు చెందిన ఇంద్రబాబు(58), ఆయన సతీమణి విజయలక్ష్మి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలకు శుక్రవారం బి.మఠానికి వచ్చారు. రాత్రి దర్శనం చేసుకుని స్థానిక బద్వేల్ రోడ్డులోని అన్నదాన సత్రం వద్ద సేద తీరారు. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ కారు ఆన్‌చేసి కిందకు దిగాడు. కారులో ఉన్న బాలుడు గేర్ వేయడంతో కారు ఇంద్రబాబుపైకి దూసుకెళ్లింది. దీంతో అతను మరణించాడు. భార్య విజయలక్ష్మికి గాయాలయ్యాయి.

మార్కెట్‌లోకి మహేంద్ర కొత్త కారు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంలోని ఫినిక్స్ మాల్‌లో 'మహేంద్ర ఎక్స్‌యువీ3ఎక్స్‌ఓ' కొత్త కారును శనివారం ఏపీ సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐడీ ఎస్పీ సరిత మాట్లాడుతూ మహేంద్ర కొత్త కారును మార్కెట్లోకి విడుదల చేసినట్టు చెప్పారు. అందులో అత్యంత సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయని, ఫైవ్ స్టార్ రేటెడ్ కారు అని వివరించారు. ఎండీ చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ ఇందులో ఆరు ఎయిర్ బ్యాగ్స్, నాలుగు డిస్క్ బ్రేకులు, 2,600 లాంగెస్ట్ వీల్ బేస్, సిక్స్ స్పీడ్ ఆటో ట్రాన్స్‌మిషన్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 17 ఇంచెస్ అలాయ్ వీల్స్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, ఫార్వర్డ్ కొలిచిన వార్నింగ్ ఫీచర్స్ ఉన్నాయని వెల్లడించారు. దీని ప్రారంభ ధర రూ.7.5 లక్షలని, ఇప్పటికే 30 కార్లు బుకింగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. మహేంద్ర కార్ షోరూమ్ జీఎం సందీప్ మాట్లాడుతూ మంచి ఫీచర్స్ ఉన్నాయని చెప్పారు. బుకింగ్ మొదలైన రోజే 50 వేల మంది కారు కోసం పేర్లు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. చుక్కపల్లి ప్రియాంక, మహేంద్ర సేల్స్ మేనేజర్స్, సేల్స్ కన్సల్టెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐడీ ఎస్పీ సరిత, ఎండీ చుక్కపల్లి రాకేష్ తదితరులు